అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శనివారం 19 ఆగస్టు 2023 పేజీలు : 04

# ఇప్పటివరకు 83%కుపైగా ఇంటింటిసర్వే పూర్తి

## - కలెక్టర్ పి.అరుణ్‌బాబు


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**శ్రీసత్యసాయిజిల్లా, ఆగస్టు 18, ప్రభాతవార్త ప్రతినిధి:**
జిల్లాలో ఇంటింటి ఓటర్ల సర్వే కార్యక్రమంలో 83 శాతం పూర్తయినట్లు శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు వివరించారు. శుక్రవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించి వీడియో కాన్ఫరెన్స్ నందు పుట్టపర్తి కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్‌తో పాటు ఇన్‌చార్జ్ సంయుక్త కలెక్టర్ కార్తీక్, డిఆర్‌ఓ కొండయ్య, పుట్టపర్తి ఆర్‌డిఓ భాగ్యరేఖ, ధర్మవరం ఆర్‌డిఓ తిప్పే నాయక్, కదిరి ఆర్‌డిఓ రాఘవేంద్ర, మడకశిర నియోజకవర్గం ఎన్నికల అధికారి చిన్నయ్య, సంబంధిత ఆయా నియోజకవర్గాల తహశీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో చేపట్టిన ఇంటింటి ఓటర్ల సర్వే కార్యక్రమంను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి వివరిస్తూ, జిల్లాలో 5,48,750 ఇళ్ళకు సంబంధించి ఓటర్ల జాబితాను సర్వే చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 83% పూర్తయ్యిందని, మిగిలిన సర్వేను మూడురోజుల్లో పూర్తి చేస్తామన్నారు. వీటిలో డూప్లికేట్ ఓటర్లు 633, ఇల్లు మారిన వారు 1929, మరణించిన ఓటర్లు 6,952గా గుర్తించామన్నారు. ఎన్నికల కమీషనర్ జారీ చేసిన నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటున్నామని, 100 సంవత్సరాలు దాటిన 67 మంది ఓటర్లను గుర్తించామని కలెక్టర్ తెలియజేశారు.

# అభివృద్ధి.. సంక్షేమమే.. లక్ష్యంగా సీఎం జగన్ పాలన

## - నగరంలో రూ.750 కోట్లతో రోడ్లు డ్రైనేజీల అభివృద్ధి - అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి


పారిశుద్ధ్య కార్మికులకు రేషన్‌కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే అనంత

**అనంతపురం సిటీ, ఆగస్టు 18 ప్రభాతవార్త**
దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనను కొనసాగిస్తున్నారని, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. అనంతపురం ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం పారిశుద్ధ్య కార్మికులకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చేతులు మీదుగారేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులు రేషన్‌కార్డులు లేకపోవడం వల్ల సంక్షేమ పథకాలకు దూరం అవుతున్నారన్న భావనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా పారిశుద్ధ్య కార్మికులకు రేషన్‌కార్డులను అందించే కార్యక్రమానికి శ్రీకారంచుట్టారన్నారు. రేషన్‌కార్డులను అందించడం వల్ల పారిశుద్ధ్య కార్మికుల కుటుంబాలకు కూడా అమ్మఒడి వంటి పథకాలు వర్తింప జేసే అవకాశం ఏర్పడుతుందన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం అన్నారు. 14 ఏళ్లపాటు మ ఉఖ్యమంత్రిగా పని చేశానని చెప్పుకునే చంద్రబాబునాయుడు అధికారంలో ఉన్నంత కాలం ప్రజలందరికీ అభివృద్ధి సంక్షేమ పథకాలు ఎందుకు అందించ లేకపోయారని ప్రశ్నించారు. నేడు అధికారం కోసం ఆర్టిసి బస్సు లలో ప్రయాణిస్తున్న చంద్రబాబు, అధికారంలో ఉన్నప్పుడు ఆర్టిసి గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో 750 కోట్లఓ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపడుతున్నామని పేర్కొన్నారు. అదే విధంగా నాడు నేడు పథకం ద్వారా రూ.300 కోట్లతో ప్రభుత్వ ఆసుపత్రని అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో డంప్ యార్డును తరలిస్తామని తాము ఇచ్చిన హామీ తమకు గుర్తుందని అందులో భాగగానే 5 లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాలు డంపింగ్ యార్డును 3.5 లక్షల వ్యర్థాలను ఇప్పటికే తరలిచామని, మిగిలిన పనులను కూడా త్వరలోనే పూర్తి చేసి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామన్నారు. 5 ఏళ్ల టీడీపీ పాలనలో అనంతపురం నగరంలో కమిషన్లు, కలహాలతోనే కాలం గడిచింది తప్పా నగరాభివృద్ధికి టీడీపీనేతలు చేసిందేమీ లేదన్నారు. అందుకు భిన్నంగా వైఎస్‌ఆర్‌సిపి అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ ప్రజా ప్రతినిధులంతా సమిష్టిగా పని చేస్తూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నగరాభివృద్ధికి కృషి చేస్తున్నామని, ఇదే రీతిలో రానున్న రోజుల్లో సైతం పని చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 21వ డివిజన్ కార్పోరేటర్ సాకే చంద్రలేఖ, ఎస్సీ సెల్ నగరాధ్యక్షులు సాకే కుళ్లాయప్పలు, సచివాలయ కన్వీనర్లు శోభన్, సురేష్, నాయకులు ముత్యాలప్ప, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# చెప్పిన అబద్దాలే ఎన్ని సార్లు చెబుతావ్ ప్రకాష్‌రెడ్డి

- ఎవరి హయాంలో అభివృద్ధి జరిగిందో చర్చకు రమ్మంటే రావు
- పైగా నిత్యం పరిటాల జపం చేస్తూ ఆరోపణలు చేస్తుంటావ్
- శాశ్వతంగా నిలిచిపోవాలని పనులు చేపట్టింది మేమే
- ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డిపై మాజీ మంత్రి పరిటాల సునీత ఆగ్రహం
- టిడిపి ప్రతి ఇంటా సంక్షేమ విప్లవం తీసుకొస్తుందన్న సునీత


మాజీ మంత్రి పరిటాల సునీతను సన్మానిస్తున్న దృశ్యం

**రామగిరి, ఆగస్టు 18 ప్రభాతవార్త**
పాడిందే పాడరా.. పాసిపళ్ల దాసన్న అన్న చందంగా ఎ మ్మెల్యే ప్రకాష్‌రెడ్డి చెప్పిన అబద్దాలనే పదేపదే చెప్పి ప్రజలను నమ్మించాలని చూస్తున్నారని మాజీ మ ంత్రి పరిటాల సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండల కేంద్రంలోని బిసి కాలనీలో ఆమె భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్తూ మినీ మేనిఫెస్టోకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. అలాగే పథకాల గురించి వివరిస్తూ వాటి వలన కలిగే లబ్దిని తెలియజేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత త్రపి ఇంట్లో అర్హత ఉన్న అందరికీ పథకాలు అందుతాయని ఈ సందర్భంగా సునీత అన్నారు. సంక్షేమ విప్లవం అంటే ఏంటో టిడిపి పాలనలో చూడబోతున్నారన్నారు. ముఖ్యంగా మహిళలు, యువత, రైతులే తమకు తొలి ప్రాధాన్యత అని విమర్శించారు. మరోవైపు పేరూరు డ్యాంకు తానే నీరు తెచ్చానని ప్రకాష్‌రెడ్డి గొప్పలు చెప్పుకోవడమే పనిగా పెట్టుకున్నారన్నారు. అసలు నువ్వు తీయించిన కాల్వ పరిస్థితి ఏంటో ఒక్కసారి అక్కడికి వెళ్లి చూడాలన్నారు. ఏదో తూతూ మంత్రంగా పనులు చేసి అరకొరగా నీరు పారించి.. డ్యాంను నేనే నింపానంటున్నావని విమర్శించారు. వర్షపు నీటితో పేరూరు డ్యాంకు నీరు వస్తే.. అందులో గొప్ప ఏముందన్నారు. పేరూరు జలాశయానికి శాశ్వత ప్రాతిపదికన నీరు అందించాలని మేము ప్రయత్నిస్తే.. దానిని అటకెక్కించావని ఆరోపించారు. నువ్వు ఆరంభ శూరత్వం తరహాలో మొదలు పెట్టిన ప్రాజెక్టులు పనులు ఎక్కడి వరకు వచ్చాయో చెప్పే ధైర్యం ఉందా అని నిలదీశారు. పైగా రాప్తాడును అభివృద్ధి చేశానని చెప్పుకునే నువ్వు.. చర్చకు రమ్మంటే వచ్చే ధైర్యం లేదన్నారు. ఇలాటి అబద్దాలు చెప్పి నాలుగున్నరేళ్లు గడిపావని, నీ మాటలు ఇక ప్రజలు కూడా నమ్మే పరిస్థితుల్లో లేరని సునీత అన్నారు.

# ధర్మకర్తలు దేవునికే ప్రథమ సేవకులమనే భావనతో పనిచేయాలి

## - దేవాదాయశాఖ ప్రభుత్వ సలహాదారులు జ్వాలాపురం శ్రీకాంత్


శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

**అనంతపురం ఓల్డ్‌టౌన్, ఆగస్టు 18 ప్రభాతవార్త**
దేవాదాయశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న దేవాలయాలకు నియమించబడ్డ ధర్మకర్తల మండలి సభ్యులు దేవునికే ప్రథమ సేవకులమనే భావనతో పనిచేయాలని దేవాదాయశాఖ ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ అన్నారు. కమీషనర్ దేవాదాయశాఖ సూచనల ఆదేశాల మేరకు రాష్ట్ర దేవాదాయ పాలనా సంస్థచే ఇస్తున్న శిక్షణా కార్యక్రమాల్లో భాగంగా ఆ సంస్థ అనంతపురం డైరెక్టర్ డి.రామచంద్రరావు, శ్రీసత్యసాయి జిల్లాలో ఉన్న ప్రభుత్వ దేవాయాలల్లో ప్రభుత్వం నియమించిన ధర్మకర్తల మండలి సభ్యులు, చైర్మన్లకు వివిధ అంశాలపైన ధర్మకర్తల బాధ్యతలు, వారి విధుల గురించి తదితర అంశాలపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జ్వాలాపురం శ్రీకాంత్ మాట్లాడుతూ దేవాలయ భూములను పరిరక్షణ విషయంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృతనిశ్చయంతో వున్నారని, ఆలయ భూములను కబ్జా చేస్తే పార్టీలకు అతీతంగా చర్యలు తీసుకోమని సిఎం ఆదేశించారని తెలిపారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా జగన్ ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. సిఎం ఆశయానికి అనుగుణంగా ధర్మకర్తలు హిందూ ధర్మ పరిరక్షణ లో నిమగ్నం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్లు రామచంద్రారెడ్డి, పంపనూరు చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, అశ్వత్థం పప్పూరు, గూగూడు, పామిడి చైర్మన్లు పలు అంశాలు, అభివృద్ధి పనులపై శ్రీకాంత్‌ను అడుగగా ఆయన తప్పకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తనవంతు సహకారం అందచేస్తానన్నారు. అనంతపురం మొదటిరోడ్డు శివాలయం ధర్మకర్తలు సురేష్, వెంకటస్వామి, తిమ్మారెడ్డి, మాజీ ధర్మకర్త వేణు, సుబ్రమణ్యంలు శివాలయాన్ని పునర్ నిర్మాణం చేయాల్సిన అవసరం వుందని తక్షణమే దేవాదాయశాఖ సర్వశ్రేయో నిధి నుండి నిధులు మంజూరు చేయిస్తే దానికి తగిన మాచింగ్ గ్రాంటును కట్టడానికి భక్తులు సిద్ధంగా వున్నారని సలహాదారుని దృష్టికి తీసుకెళ్లగా ఎమ్మెల్యే కూడా శివాలయాన్ని అభివృద్ధి చేయడానికి సిద్ధంగా వున్నారని ఆయన చొరవతోనే సిఎం దృష్టికి తీసుకెళ్లి త్వరలో నిధులు మంజూరయ్యేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు ఆలయాల ఇఒలు, ధర్మకర్తలు, చైర్మన్లు పాల్గొన్నారు.

# బిజెపి రాష్ట్ర కమిటీలో అనంతకు మొండి చేయి

## - రాష్ట్ర కమిటీలో అనంతపురం జిల్లా నేతలకు దక్కని చోటు



**అనంతపురం సిటీ, ఆగస్టు 18 ప్రభాతవార్త**
భారతీయ జనతాపార్టీ రాష్ట్ర కమిటీలో అనంతపురం జిల్లాకు మొండి చేయి ఎదురైంది. బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నియామకం తర్వాత ప్రకటించిన రాష్ట్ర కమిటీలో అనంతపురం జిల్లా నుంచి ఒక్క నేతకు కూడా రాష్ట్ర కమిటీలో కానీ అనుబంధ సంఘాలలో కానీ ప్రాధాన్యత కల్పించకపోవడం ప్రాధాన్యతసంతరించుకుటోంది. గతంలో రాష్ట్ర కమిటీలో అనంతపురం నగరానికి చెందిన చిరంజీవిరెడ్డి కార్యదర్శిగాను, సీనియర్ నేతలు అంకాల్‌రెడ్డి, లలిత్‌కుమార్ లకు రాష్ట్ర కమిటీ న భ్యులుగాను ప్రాతినిధ్యం ఉండేది. నూతనంగా నియమించిన రాష్ట్ర కమిటీలో అనంతపురం పార్లమెంట్ నుంచి ఏ ఒక్కరికీ అవకాశం కల్పించక పోవడంవిశేషం. ఇదే సందర్భంలో ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలోని హిందూపురం పరిధిలో రాష్ట్ర కమిటీలో ముగ్గురికి ప్రాధాన్యత కల్పించడం గమనార్హం. బిజెపి రాష్ట్రఉపాధ్యక్షులుగా విష్ణువర్ద న్‌రెడ్డి, యువమోర్చ రాష్ట్ర అధ్యక్షునిగా మిట్టా వంశీ, ఎస్సీ మోర్చ రాష్ట్రఅధ్యక్షునిగాగుడిసె దేవానంద్‌లకు అవకాశంకల్పించారు. హిందూపురం పార్లమెంట్‌లో ముగ్గురికిఅవకాశం కల్పించి అనంతపురం పార్లమెంట్ నుంచి రాష్ట్రకమిటీతోపాటు అనుబంధ కమిటీల్లోకూడా ప్రాధాన్యత కల్పించకపోవడం చర్చకు దారి తీస్తోంది.

# చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలి

- రైతులకు పగటిపూట 9 గంటల విద్యుత్ సరఫరా చేసేలా చూడాలి
- అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ టి.రాజశేఖర్‌రెడ్డి
- ఈ క్రాప్ బుకింగ్ పక్కాగా నమోదు చేయాలి
- జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.గౌతమి

**అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 18 ప్రభాతవార్త**
చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని అగ్రిఅడ్వైజరీ బోర్డు చైర్మన్ టి.రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్, ఎంపి తలారి రంగయ్య, జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డిసిసిబి బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, వ్యవసాయశాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, వ్యవసాయ అనుబంధశాఖల అధికారులు, సలహా మండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ టి.రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని ఆర్‌బికెల పరిధిలో చిరుధాన్యాలు రాయితీతో ఇవ్వాలన్నారు. ఇంతకు ముందు వేరుశనగ విత్తనాలను రాయితీతో అందించడం జరిగిందని, చిరుధాన్యాలు కూడా రాయితీతో ఇవ్వడం ద్వారా పంట మార్పిడికి అవకాశం వుంటుందన్నారు. ఆర్‌బికె స్థాయిలో తప్పనిసరిగా సమావేశాలు నిర్వహించాలని, అక్కడ చర్చించే విషయాలపై వివరాలను జిల్లా స్థాయికి అందించాలన్నారు. రైతులకు పగటిపూటే 9 గంటల విద్యుత్ సరఫరా చేసేలా చూడాలన్నారు. యూరియా బ్యాగ్ కన్నా నానో యూరియా ధర తక్కుగా వుంటుందని, నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. చీనీ పంట విక్రయాల్లో రైతు నష్టపోకుండా కమీషన్ కాకుండా తీసుకునే సూట్ విక్రయాలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ నడుస్తోందని, వ్యవసాయ అనుబంధశాఖలు, శాస్త్రవేత్తలు రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఎప్పటికప్పుడు అందించాలన్నారు. వ్యవసాయ అనుబంధశాఖల అధికారులు అనునిత్యం అప్రమత్తంగా వుండాలన్నారు. సాగు చేసిన పంట వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలన్నారు. 15లోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు పంపిణీ చేయాలన్నారు. వేరుశనగ సాగును తగ్గిస్తూ కందులు, శనగలు, ఉలవల సాగును ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. చీనీ పంట విక్రయాల్లో అదనపు డబ్బులు వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గతేడాది మంజూరు చేసిన డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలు క్షేత్రస్థాయిలో పొలాల్లో వున్నాయా లేదా అనేది పరిశీలించాలన్నారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, ప్రకృతి వ్యవసాయంపై రైతులకు తెలియచేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయ పొలాలను వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు పరిశీలించాలన్నారు. జిల్లాలో చేపట్టిన మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్స్ గోదాముల నిర్మాణాలను డిసెంబర్ లోపు ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఎంపి తలారి రంగయ్య మాట్లాడుతూ చిరుధాన్యాల సాగును మరింత పెంచాలన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ మాట్లాడుతూ పౌరసరఫరాలశాఖ ద్వారా కనీస మద్దతు ధరతో రాగులు, జొన్నలు, కొర్రలు, కందులు రైతులతో కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో పశుసంవర్ధకశాఖ జెడి సుబ్రమణ్యం, ఉద్యానశాఖ డిడి రఘునాథరెడ్డి, ఎపిఎంఐపి పిడి ఫిరోజ్‌ఖాన్, ఫిషరీస్ డిడి శాంతి, సెరికల్చర్ ఆఫీసర్ ఆంజనేయులు, మార్కెటింగ్ ఎడి చౌదరి, సివిల్ సప్లైస్ డిఎం నీలమయ్య, రేకులకుంట ఎఆర్‌ఎస్ ప్రధాన శాస్త్రవేత్త సహదేవరెడ్డి, ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ సురేం ద్ర, మార్క్‌ఫెడ్ డిఎం పెన్నేశ్వరి, వ్యవసాయసలహా మండలి సభ్యులు సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 'జయ'ంతో 'స్వప్న'ం సాకారమవుతున్న వేళ..!

## - వైద్య విద్యకు ఎంపికైన నేతన్న పిల్లలు - మగ్గం సాయంతో నెగ్గిన ప్రతిభ


తల్లిదండ్రుల కలను సాకారం చేసే దిశగా స్వప్న,జయవర్ధన్

**తాడిపత్రి,ఆగస్టు18,ప్రభాతవార్త:**
గమ్యం చేరేందుకు పట్టుదలే కీలకమని, చిత్తశుద్ధితో ప్రయత్నిస్తే లక్ష్యసిద్ధి కష్టమేమీ కాదని నిరూపించారు ఆ విద్యార్థులు. వారు ఎదుర్కొన్న అవరోధాలు తెలుసుకుంటే పలువురిలో స్ఫూర్తిని రగిలిస్తాయి. సానుకూల దృక్పథాన్ని కోల్పోకుండా, సమయాన్ని ప్రయోజనం లేని పనులతో వృథా చేసుకోకుండా తమలోని ప్రతిభా పాటవాలను వినియోగించుకొని సమాజంలో సుస్థిర స్థాయిని ఏర్పరచుకొనే దిశగా అడుగులేస్తున్న ఈ పేదింటి విద్యార్థులు యువతకు ఆదర్శప్రాయులని చెప్పవచ్చు. చిరకాల అనారోగ్యం వెంటాడుతున్నా, సొంతిళ్లు, సుస్థిర ఆదాయం లేకపోయినా వైద్య విద్యకు ఎంపికై పలువురి యువతకు ఆదర్శంగా నిలిచిన చేనేత కుటుంబానికి చెందిన అక్కాతమ్ముళ్లపై 'ప్రభాతవార్త' ప్రత్యేక కథనం.

ః యాడికిలోని ఆంజనేయస్వామి కాలనీకి చెందిన రాజగోపాల్ ఓ అద్దె ఇంటిలో ఉంటూ చేనేత మగ్గం ద్వారా వచ్చే చాలీచాలని ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొన్నేళ్లు ఓ సిమెంట్ ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డుగా కూడా పనిచేశాడు. భార్యాభర్తలిద్దరూ మగ్గం నేస్తూ హిమోఫిలియో వ్యాధితో నిత్యం బాధపడుతున్న కొడుకును, పేదరికం వెంటాడుతున్నా చదువంటే మక్కువ చూపుతున్న కూతురిని ఎలాగైనా చదువుతో చక్కగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకొని కష్టపడ్డారు. వారి పిల్లలను చక్కటి దారివైపు మళ్లించి సంతోషాన్ని సొంతం చేసుకుంటున్నారు.

**ఃఇదీ నేపథ్యం..!** మేనరికపు వివాహం చేసుకున్న రాజగోపాల్, వెంకటలక్ష్మిలకు స్వప్న, జయవర్ధన్‌లు సంతానం. జయవర్ధన్‌కు ఆరు నెలల వయస్సులోనే హిమోఫిలియో వ్యాధి బయటపడింది. ఈ వ్యాధి లక్షణమేమిటంటే శరీరంలో ఎక్కడైనా చిన్న రక్తగాయమైనా అక్కడి నుంచి రక్తం ఆగకుండా కారుతూనే ఉంటుంది. రక్తం గడ్డకట్టే లక్షణం ఉండదు. గాయపడినప్పుడల్లా రక్తం ధారగా కారకుండా రూ.3,500 లు విలువైన ఇంజక్షన్‌లు నెలకు మూడు చొప్పున వాడాల్సి ఉంటుంది. జిల్లా కేంద్రానికి వెళ్లి ఒక్కోటి ఒక్కోసారి ఉచితంగా కూడా తెచ్చుకోవచ్చు. అక్కడ నిల్వ లేకపోయినా, చదువుకునే సందర్భంలో వేరే చోట ఉన్నప్పుడు సొంత డబ్బులు వెచ్చించి ఈ ఇంజక్షన్‌లు కొనుగోలు చేయాల్సి ఉంటుందని, గాజుబొమ్మలాంటి తన కుమారుడి జీవితాన్ని తలచుకొని లోలోపే కుమిలిపోయేవాడినని రాజగోపాల్ చెబుతున్నాడు. సొంతిళ్లు లేక, కొడుకు ఆరోగ్యం సరిగా లేక, మగ్గంతో సరిపడా ఆదాయం లేక సతమతమవుతున్న కుటుంబ పరిస్థితులను కళ్లారా చూసిన తమ పిల్లలు చదువులో చక్కగా రాణించడం కొంత ఉపశమనాన్ని ఇస్తోందని ఆయన అంటున్నాడు.

**ఃకష్టాలే వారికి ప్రేరణ** హిమోఫిలియో వ్యాధి తమ కుటుంబాన్ని ఎలా వేదిస్తోందో ప్రత్యక్షంగా చూసిన రాజగోపాల్ కూతురు స్వప్న, కొడుకు జయవర్ధన్‌లు వైద్య విద్యలో రాణించి మాలాంటి కుటుంబాలకు తామెందుకు ఉపశమనం ఇవ్వకూడదని నిర్ణయించుకున్నారు. పట్టుదలతో చదివిన జయవర్ధన్,స్వప్నలు తమ కలను సాకారం చేసుకున్నారు. జయవర్ధన్ పదో తరగతిలో 8.5 జీపీఏ, ఇంటర్ బైపీసీలో 942 మార్కులు, నీట్‌లో 58.40 పర్సంటైల్ సాధించి దివ్యాంగుల(పీడబ్ల్యుడి) కోటాలో ఉచిత వైద్య విద్యకు ఎంపికై కడప రిమ్స్‌లో చోటు దక్కించుకున్నాడు. ఇక స్వప్న యాడికిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదివి 9.8 జీపీఏ సాధించింది. దీంతో ఆర్టీటీ ఉచిత విద్యకు ఎంపికై విజయవాడలోని చైతన్య కళాశాలలో ఇంటర్ పూర్తి చేసింది. ఇంటర్‌లో 976 మార్కులు సాధించిన స్వప్న నీట్‌లో 720 మార్కులకు 506 మార్కులు సాధించి బీసీ కోటాలో 47 వేల ర్యాంకు దక్కించుకుంది. నీట్ కౌన్సెలింగ్‌లో ఎదురైన పోటీలో చిత్తూరు అపోలో మెడికల్ కళాశాలలో వైద్య విద్యకు స్థానం సంపాదించుకుంది.

**ఃచేయూతనిచ్చే చేతుల కోసం..!** వైద్య విద్యకు స్థానం సంపాదించుకునే వరకు కష్టపడిన తమకు ఇప్పుడు ఖరీదైన వైద్య విద్యను చదివించాలంటే జయవర్ధన్‌కు రూ.60 వేలు, స్వప్నకు రూ. 2 లక్షల వరకు ఖర్చవుతోందని, చేయూతనిచ్చే చేతుల కోసం ఎదురు చూస్తున్నామని రాజగోపాల్,వెంకటలక్ష్మి దంపతులు పేర్కొంటున్నారు. పట్టుదల ఉన్న పేదింటి పిల్లలను ప్రోత్సహించే వారు సమాజంలో ఉన్నారనే నమ్మకం మాకుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



03ATP18_03ATP18.qxd 18-08-2023 PM 11:12 Page 1



# జెసి కుటుంబ రాజకీయ శకం ముగిసింది

## - ముడుపులు రాలేదని జెసి ప్రభాకర్ ఆక్రోశం

## - వైసీపీ జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య విమర్శలు

అనంతపురం సిటీ, ఆగస్టు 18 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా రాజకీయాలలో జెసి కుటుంబ రాజకీయ శకం ముగిసిందని వైసీపి అనంతపురం జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య స్పష్టం చేశారు. జిల్లా వైకాపా కార్యాలయంలో శుక్రవారం ఆయన కార్పోరేటర్ శ్రీనివాసులు, రాష్ట్ర వ్యవసాయ మిషన్ కమిటీ సభ్యులు రాజారాంలతో కలసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జెసి ప్రభాకర్‌రెడ్డి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మున్సిపల్ అధికారులపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. జెసి ప్రభాకర్‌రెడ్డి మున్సిపల్ చైర్మన్‌గా పని చేసిన ప్రతి సందర్భంలోనూ మున్సిపల్‌కార్యాలయం నుంచి ముడుపులు అందేవని, కేతిరెడ్డి పెద్దారెడ్డి ఎమ్మెల్యేగాఎన్నికైన తర్వాత ఆ ముడుపులు ఆగిపోయా యన్న ఆక్రోశంతోనే ఎమ్మెల్యేపైన అధికారులపైన పోలీసులపైన విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. మా ఊరు మా తాడిపత్రి అంటూ జెసి ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలు చేస్తున్నారని, తానొక్కడిదే తాడిపత్రి కాదని, తమది కూడా తాడిపత్రి అని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నంత కాలం జెసి ప్రభాకర్‌రెడ్డి దోచుకున్నారని, నేడు బాబా అవతారం ఎత్తి ప్రవచనాలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. తాను ఉన్నత చదువులు చదివానని చెప్పు కునే ప్రభాకరరెడ్డి చదువుతోపాటు సంస్కారం నేర్చుకోవాలని, సంస్కారం లేనప్పుడు ఎంత చదువుకుని ఏమి ఉపయోగమని ఆయన ప్రశ్నించారు. తాడిపత్రిలో మున్సిపల్‌కార్యాలయాన్ని జెసి నిర్మించి ఉండవచ్చునని, అది మాత్రమే అభివృద్ధి కాదన్నారు. తాడిపత్రి అభివృది చెంది ఉంది అంటే అది దివంగత నేత వైఎస్ఆర్ చలవ వల్లనే అన్నారు. మహానేత వైఎస్ఆర్ తాడిపత్రి అభివృద్ధి కసం జెసి నాగిరెడ్డి తాగునీటి పథకానికి రూ.500 కోట్లుకేటాయించారని, చాగల్లు, పెండేకల్లు రిజర్వాయర్లునిర్మించడంతోపాటు తాడిపత్రి ప్రాంతంపై ప్రత్యేక అభిమానంతో రూ.2వేల కోట్లు కేటాయించారని స్పష్టం చేశారు. ఇప్పటికైనా జెసి ప్రభాకర్ దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని ఆయన సూచించారు.




మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య

# బస్సు యాత్రను విజయవంతం చేద్దాం

## - దేశాన్ని రక్షించుకుందాం - రాష్ట్రాన్ని కాపాడుకుందాం - గోడ పత్రికలు విడుదల చేసిన సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్

అనంతపురం, ఆగస్టు 18 ప్రభాతవార్త బ్యూరో

.ప్రధాని నరేంద్ర మోదీ కబంధ హస్తాల నుంచి దేశాన్ని రక్షించుకుందాం, సీఎం జగన్ నిరంకుశ పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకుందామని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో ఆ పార్టీ నాయకులతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. పాలక ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు తెలియజేసే క్రమంలో వారిని చైతన్య పరిచేదిశగా సిపిఐ రాష్ట్ర నాయకత్వం ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 8 వరకు రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ముం దుగా బస్సు యాత్ర గోడపత్రికలను విడుదల చేశ్వారు. యాత్ర కార్యక్ర మంలో భాగంగా సెప్టెంబర్ 3, 4, 5వ తేదీల్లో గుత్తి నుంచి బయల్దేరి గుంతకల్లు, కళ్యాణదుర్గం, సత్యసాయి జిల్లాలో ధర్మవరం, పుట్టపర్తి, కదిరి ప్రాంతాల్లో రోడ్‌షోలు, బహి రంగ సభలు ఉంటాయని 8న తిరుపతిలో ముగింపు సభ జరుగుతుందన్నారు. ఈ కార్య క్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శిలు నారాయణస్వామి, మల్లికార్జున, కార్యవర్గ సభ్యులు రామకృష్ణ, శ్రీరాములు, కేశవరెడ్డి, నారాయణస్వామి, రమణ, నాగ రాజు, సంతోష్‌కుమార్; ఏపి గిరిజన సమాఖ్య రాష్ట్ర నాయకులు రామాంజినేయులు పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

# బాపూజీనగర్‌లో పీయూ కాలేజీ స్థాపన చేయడం గ్యారెంటీ

## - ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి





బాపూజీనగర్ పాఠశాలలో పౌష్టిక ఆహార యోజన కింద విద్యార్థులకు గుడ్లు పంపిణీ కార్యాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

బళ్లారి, ఆగస్టు18, ప్రభాతవార్త ; నగరం నడి మధ్యలో గల 7వ వార్డు బాపూజీనగర్‌లో పీయూ కాలేజీని ప్రారంభించడం ఖాయమని స్థానిక ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి తెలిపారు. బాపూజీనగర్‌లోని పాఠశాలలో ప్రభుత్వ కార్యక్రమం అయిన విద్యార్థులకు పౌష్టికాహార యోజన కింద కోడి గుడ్ల పంపిణీ కార్యానికి శ్రీకారం చుట్టి మాట్లాడారు. బాపూజీనగర్‌లో ప్రస్తుతం హైస్కూల్ మాత్రమే ఉన్నదని, ఎన్నో రోజులుగా ఇక్కడ పీయూ కాలేజీ స్థాపన చేయాలన్న డిమాండ్ తల్లిదండ్రుల నుంచి వస్తున్నదని, అన్ని కలిసి వస్తే వచ్చే విద్యా సంవత్సరానికి పీయూ కాలేజీని బాపూజీనగర్‌లో ప్రారంభిస్తామని వెల్లడించారు.

ప్రస్తుతం ఉన్న హైస్కూల్ కట్టడం బీటలువారి శిథిలావస్థకు చేరుకున్న సమాచారం ఉన్నదని, త్వరలో దీనిని కూల్చివేసి కొత్తగా అదనపు గదులతో పీయూ కాలేజీ స్థాయిలో నూతన భవనం నిర్మిస్తామని పేర్కొన్నారు. పేద పిల్లల విద్యాభ్యాసానికి రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డీసీఎం డి.కె.శివకుమార్ నేతృత్వంలోని ప్రభుత్వం అన్ని విధాలా ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల్లో పోషకాంశాల లేమితో బాధపడుతున్న విద్యార్థులకు ఉత్తమ ఆరోగ్యం కల్పించేదిశలో ఆహారంలో కోడిగుడ్ల పంపిణీ చేసే కార్యాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని చెప్పారు. కోడిగుడ్లు సేవించని విద్యార్థులకు అరటిపండ్లు, వేరుశనగ చిక్కీలను ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. విద్యార్థులకు వినోద కార్యక్రమాలు జరుపుకునేందుకు వీలుగా క్రీడలు, సాంస్కృతిక కార్యకలాపాల కోసం ఒక కార్యక్రమాన్ని రూపొందించి తన సొంత ఖర్చుతో విద్యార్థులకు ఆ పోటీలను నిర్వహించి బహుమతుల ప్రదానం చేస్తామని చెప్పారు. మీతో ఒకరోజంతా ఆటపాటల్లో కాలం గడపాలన్న కోరిక ఉన్నదని వెల్లడించిన ఎమ్మెల్యే, ఆ సంతోషదినం రోజు త్వరలోనే వెల్లడిస్తానని విద్యార్థుల కేరింతల నడుమ, హర్షధ్వానాల మధ్య చెప్పారు. ఈ సందర్భంలో మేయర్ డి.త్రివేణి, ఉపమేయర్ జానకి, కార్పొరేటర్లు ఉమాదేవి, రామాంజనేయులు, నాయకులు శివరాజ్, హెచ్.సిద్ధన్న, రామకృష్ణ, యల్లప్ప, వెంకటేష్, దాస్, ఇనామ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కృష్ణదేవరాయుల విగ్రహ నిర్మాణానికి భూమి పూజ

## - పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి,ఎమ్మెల్యే



విగ్రహపూజా కార్యక్రమంలో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పివి సిద్దారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా



పూజా కార్యక్రమానికి హాజరైన వైసిపి నాయకులు, కార్యకర్తలు

నంబులపూలకుంట, ఆగస్టు 18, ప్రభాతవార్త:

మండల పరిధిలోని గూటిబైలు గ్రామం తిమ్మమ్మమర్రిమాను ఆవరణంలో నూతనంగానిర్మిస్తున్న శ్రీ కృష్ణదేవరాయుల వారి విగ్రహా నిర్మాణానికి భూమిపూజా కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్దారెడ్డి పాల్గొనడం జరిగింది. మొదటగా శ్రీ తిమ్మమాంబ అమ్మవారికి ప్రత్యేక పూజాలు నిర్వహించిన అనంతరం శ్రీ కృష్ణదేవారాయుల వారి విగ్రహ నిర్మాణానికి భూమి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా మాట్లాడుతూ రాబోవు తరాలకు రాయలవారి చరిత్రను తెలియజేసే విధంగా చేపట్టిన విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులను,అందుకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరిని అభినందించారు. ఎన్నో సంవత్సరాల చరిత్ర కలిగిన తిమ్మమ్మమర్రిమాను ప్రాంతాన్ని టూరింజంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరుపున అభివృద్ధి చేస్తామని, ఈ ప్రాంతాన్ని టూరిస్టులు వచ్చేందుకు వీలుగా రవాణా హోటల్ తదితర వాటిని ప్రభుత్వం తరుపునుండి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సహకారంతో శ్రీతిమ్మమ్మమర్రిమాను ప్రాంతంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, మన ప్రభుత్వం వచ్చిన తిమ్మమ్మమ మర్రిమాను ప్రత్యేక పంచాయతీని చేశామని, దాదాపు కోటి రూపాయలకు పైగా వెచ్చించి దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న రహదారిని నిర్మించామన్నారు. అంతేకాకుండా సిమెంట్ రోడ్లను వేయగలిగామని తెలియజేశారు. టూరిజం భవనం ఇప్పటికే నిర్మాణం పూర్తి చేసుకున్నా కూడా టూరిస్టులకు అందుబాటులోకి రాలేదని, రాబోవు రెండు మూడు మాసాలలో వీటిని కూడా అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. టూరిజంగా తిమ్మమ్మమర్రిమాను ప్రభుత్వం నుండి ఏ విధంగా అయితే అభివృద్ధి చేయాలో అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రభుత్వం చేపట్టబోయే ఈ పనులన్నిటికి కూడా స్థానికంగా మనందరి సహకారం కూడా కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, శ్రీకృష్ణదే వరాయ విగ్రహ కమిటీ సభ్యులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌లో కాంట్రాక్టు, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ విధానాన్నీ రద్దు చేయాలి

## - సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

అనంతపురం, ఆగస్టు 18 ప్రభాతవార్త

రాష్ట్రంలో 3 లక్షలకుపైగా కాంట్రాక్టు, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు 25 సంవత్సరాల నుండి శాశ్వితమైన పనుల్లో రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, సంస్థలల్లో పని చేస్తున్నారు. వైఎస్ఆర్ పార్టీ రాబోయే ఎన్నికల కోసం 10 వేల మందిని పర్మినెంట్ చేస్తామని గొప్పలు చెప్పడం విడ్డూరంగా ఉంది. శాశ్విత పనుల్లో పనిచేసే వీరందరినీ పర్మినెంట్ చేయాలని సిఐటియు డిమాండ్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఈజ్‌ఆఫ్ డూయింగ్ బిజినెస్ నెం.1గా ఉండి కేంద్ర ప్రభుత్వం నుంచి అప్పులు తెచ్చుకోవడానికి కేంద్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసింది. యాజమాన్య పక్షాన కొమ్ముకాస్తూ పర్మినెంట్ చేసే విధానాన్ని పక్కన పెట్టింది. తెలంగాణలో మొత్తం విద్యుత్ కార్మికులను, విఆర్ఎలను రాష్ట్ర ప్రభుత్వం పర్మినెంట్ చేసింది. తెలంగాణలోని విద్యుత్ కార్మికుల జీవితాల్లో సగం కూడా మన రాష్ట్రంలో ఇవ్వటం లేదు. గంగవరం పోర్టులో పని చేస్తున్న 600 మంది మత్స్యకార్మికులు 10 సంవత్సరాల నుంచి పని చేస్తున్నా పర్మినెంట్ చేయకపో వడంతో గంగవరం గ్రామస్తులు తీవ్రమైన ఆందోళనకు దిగారు. శ్రమ చేసే కార్మికులను నిలువు దోపిడి చేసే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, కార్య దర్శి ఎస్.నూర్ మహ్మద్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి నాగ మణి, నాగేంద్రకుమార్, నగర కార్యదర్శి వెంకట రమణ తది తరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

## నగరంలో శరవేగంగా అంతర్గత రహదారుల విస్తరణపనులు - నగర మేయర్ మహ్మద్ వసీం



అంతర్గత రహదారుల విస్తరణను పరిశీలిస్తున్న మేయర్

అనంతపురం, ఆగస్టు 18 ప్రభాతవార్త

అనంతపురం నగరంలో ముఖ్య మం త్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహ కార ంతో అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంక టరామిరెడ్డి చేస్తున్న అభివృద్ధి చూసి ఓర్వలేకే టిడిపి నేతలు పదేపదే అవే అసత్యాలు ప్రచారం చేస్తున్నారని నగర మేయర్ మహ్మద్ వసీం పేర్కొన్నారు. నగరంలోని 39వ డివిజన్ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో చేపడుతున్న సిమెంట్ రోడ్, డ్రైనేజీ పనులకు శుక్రవారం నగర మేయర్ మహ్మద్ వసీం పరిశీలించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మహ్మద్ వసీం మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి కృషితో నగరంలో రూ.800 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతకుంట మధు, ఖాజా, భూ మిరెడ్డి భాస్కర్‌రెడ్డి, గుర్రప్ప, బంగారప్పలతోపాటు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటి ఓటరు సర్వేలో టిడిపి బిఎల్ఎలు



ఓటరు వెరిఫికేషన్ చేస్తున్న దృశ్యం

శింగనమల, ఆగస్టు 18 ప్రభాతవార్త

శింగనమల నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసనాయుడు ఆదేశాల మేరకు తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు ఆధ్వర్యంలో శింగనమల నియోజకవర్గంలోని తరిమెల గ్రామంలో బిఎల్ఓలతో కలిసి కుమార్, బిఎల్ఎ పుల్లయ్య, బిఎల్ఎ యూనిట్ ఇన్‌చార్జ్ దండు ప్రకాష్, పెద్దమట్ల గొంది గ్రామలో బిఎల్ఎ డి.నాగేంద్ర, ఆ పార్టీ నాయకులు సురేంద్ర యాదవ్ తదితరులు ఇంటింటి ఓటరు సర్వేలో పాల్గొన్నారు.

## ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోయి అదుపుతప్పిన ద్విచక్రవాహనం

### - పెన్నానది మూడోకాలువ పైనుండి కిందపడ్డ వ్యక్తి మృతి



మృతి చెందిన తలారి వెంకటేష్

పామిడి, ఆగస్టు 18 ప్రభాతవార్త

ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును తప్పించబోయి అదు పు తప్పిన ద్విచక్ర వాహనం కిందపడి పోగా పామిడి సం తమార్కెట్‌కు చెందిన తలారి వెంకటేష్ (50) అక్కడికక్కడే మృతి చెందిన సం ఘటన శుక్రవారం పెన్నానది మూడో కాలువ వద్ద చోటుచే సుకుంది. స్థానికులు అందించిన వివరాలిలావున్నాయి.. సంతమార్కెట్‌కు చెందిన అంజి నే యులు కుమారుడు వెంకటేష్‌కు బార్య ఓబుళమ్మ, కుమార్తెలు అనూష, కళ ఉన్నారని బెల్దారి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న ఆ యన తన ఇద్దరి కుమార్తెలకు వివాహం చేశారని తెలిపారు. ఉదయం బెల్దారి పని చేయటానికి ఇంటి నుండి కల్లూరుకు ద్విచక్రవా హనంలో బయలుదేరిన వెంకటేష్ పెన్నానది మూడోకాలువ వద్ద ఎదురుగా వస్తున్న బస్సును తప్పి ంచబోయి బ్రిడ్జిపై నుండి కిందపడటం ద్విచక్ర వాహనం ఆయనపై పడి తల కు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందారన్నారు.

విషయం తెలుసుకున్న మృతుడి బార్య బందువులు అక్కడికి చేరుకుని విలపించటం పలువురుని కం టతడి పెట్టించింది. వైసీపీ నేత, ఏడిసిసి బ్యాంకు మాజీ చైర్మెన్ పామిడి వీ రాంజనేయులు, టిడిపి నేత, గుత్తి మార్కెట్‌యార్డ్ మాజీ చైరె ్మన్ కత్రిమల ప్రభాకర్‌చౌదరీ, జిల్లా కార్యదర్శి జింకల సంజీవ వెంకటేష్ మృత దేహాన్ని సందర్శించి మృతుడి బార్య, బందువులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలి యజేశారు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసు పత్రికి తరలించి మృతుడి బార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

# ముఖ్యమంత్రి మాకు న్యాయం చేయండి

## - కలెక్టరేట్ ఎదుట ఎంటిఎస్ ఉద్యోగుల ధర్నా



కలెక్టర్‌కు అర్జీ ఇస్తున్న నాయకులు

అనంతపురం న్యూటౌన్, అగస్టు 18 ప్రభాతవార్త

అన్ని ప్రభుత్వ శాఖల్లో నపి చేస్తున్న మినిమం టైం స్కేల్ ఉద్యోగులను క్రమ బద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ శుక్ర వారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహి ంచడం జరిగింది. అనంతరం కలెక్టర్ గౌతమికు వినతిపత్రం అం దజేశా రు. సందర్భంగా సంఘం నాయ కులు మాట్లాడుతూ.. మినిమం టైం స్కేల్ ఉద్యోగులను క్రమబద్దీక రించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్‌ల ఎదుట ముఖ్యమంత్రి మాకు న్యాయం చేయండి అనే కార్యక్రమం నిర్వహించామన్నారు. సీని యారిటీ ప్రాధాన్యతనిచ్చి మొదటి ప్రాధాన్యతగా 25 నవంబర్ 1993 నాటికి ముందు నియమింపబడిన మినిమం టైం స్కేల్ సిబ్బంది సర్వీసులను క్రమబద్దీకరిస్తూ ఆదేశాల జారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటిఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీని వాస్, కోశాధికారి రవిశంకర్, నారాయణరెడ్డి తది తరులు పాల్గొన్నారు.

# గ్రామంలో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు

## రుద్రంపేట సర్పంచ్ సుగాలి పద్మావతి ఆదినారాయణ నాయక్

అనంతపురం రూరల్, ఆగస్టు 18 ప్రభాతవార్త:

అనంత రూరల్ మండలం రుద్రం పేట పం చాయితీలోని ప్రజలు ఎవరు నీటీ సమ స్యతో ఇబ్బందులు పడకు డదనే ఉద్యశ్యంతో తగు చర్యలు తీసుకుంటున్నమని సర్పం చ్ సుగాలి పద్మావతి ఆదినారాయణ నాయక్ తెలిపారు. రుద్రంపేట పంచాయితీ లోని మధర్ థెరిసా కాలనీ,ఐటీ కాల నీలోని ప్రజలకు నీటీ సమస్య పరిష్కరం కోసం నూతనంగా వేయిం చిన బోరుల కుమోటర్లు మరమత్తులు చేయించడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో నీటి సమస్య ఎక్కడా రాకుండ చూడాలని ఎమ్మెల్యే అనంత వెంకట రామిరెడ్డి ఆదేశించడంతో ఆయన ఆదేశాల మేరకు పంచాయితీలోని మధర్‌థెరిసా కాలనీ, ఐటీ కాలనీలోని ప్రజలకు నీటీ సమస్య పరిష్కరం కోసం నూతనంగా బోర్లు వేచి వాటీకి మోటర్లు మరమత్తులు పనులు చేయించి ప్రజలకు నీటీ సమస్య లేకుండా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



బోరుకు మోటర్ మరమత్తు పనులు చేయిస్తున్న దృశ్యం.

## బ్యాంకు అకౌంట్‌కు ఆధార్ అనుసంధానం చేసుకోండి - ఏఓ అన్వేష్‌కుమార్

శింగనమల, ఆగస్టు 18 ప్రభాతవార్త

మండల వ్యాప్తంగా పిఎం కిసాన్‌కు సంబంధించి 117 మంది రైతులకు బ్యాంకులో వారి అకౌంట్‌కు ఆధార్ అనుసంధానం లేక పోవడం వల్ల పిఎం కిసాన్ అమౌంట్ జమా కాలేదని ఏఓ అన్వేష్‌కుమార్ తెలిపారు.

శుక్రవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేస్తూ 117 మంది రైతులు వారి బ్యాంకు అకౌంట్‌కు ఆధార్ అనుసంధానం చేసుకుంటే తిరిగి పిఎం కిసాన్ అమౌంట్ వారి ఖాతాకు జమా అవుతుందని ఆయన తెలిపారు.



ఏఓ అన్వేష్‌కుమార్

# ప్రవేశ పరీక్షకు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 18 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ స్టడీ సర్కిల్ వారు నిర్వహిస్తున్న సివిల్ సర్వీసెస్ గ్రూప్1, గ్రూప్2 పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ అందజేయుటకు ప్రవేశ పరీక్షను ఈ నెల 20వ తేదిన విశాఖపట్నం విజయవాడ తిరుపతి, అనంతపురంలో నిర్వహిస్తోంది. ఈ పరీక్షకొరకు రాష్ట్ర వ్యాప్తంగా 11008 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.

ఈ పరీక్షను నిర్వహించడానికి అనంతపురంజిల్లాలో మూడు కేంద్రాలను ఎంపిక చేయడం జరిగింది. వాటి వివరాలు కన్ మహిళా డిగ్రీ కళాశాల ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, ఎస్ఎస్‌బిఎన్ కళాశాల. ఈ మూడు పరీక్ష కేంద్రాలలో 1667 మంది అభ్యర్థులు ఆఫ్‌లైన్ తరహా పరీక్షను ఐచ్ఛిక విధానంలో రాయబోతున్నారు. ఈ ప్రవేశ పరీక్ష ఉదయం 11 గంటల నుంచి ఇంటిగంట వరకు నిర్వహించబడుతుంది. ఈ పరీక్షకు అనంతపురం జిల్లాకు చెందినటువంటి 89 మంది విద్యార్థులు ఇంకా హాల్ టికెట్లను ఎపిఎస్‌టిడిసి.ఎపిఎస్‌ఎఫ్ఎస్ఎస్.ఇన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోలేదు. కావున వెంటనే అభ్యర్థులు హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకుని మీకు కేటాయించ బడినటువంటి సెటర్లలో పరీక్షరాయవలసిందిగా షెడ్యూల్డ్ కులాలసక్షేమ, సాధికారత అధికారి ఎస్.మధుసూధన్ కోరారు.

